సాక్షి మంచిర్యాల

మంగళవారం : 1 : జూలై : 2025

మేమున్నామని..



పోయే ప్రాణం నిలిపే ప్రయత్నం చేస్తారు వీరు.. అనారోగ్యంతో చెంతకు వచ్చే రోగులకు దేవుళ్లవుతారు.. మేమున్నామని భరోసా కల్పించి వ్యాధులపై నిరంతరం సమరం చేస్తారు. వారి ఆరోగ్యానికి భరోసా కల్పించే ఆత్మీయ నేస్తాలవుతారు. ఆపత్కాలంలో బంధువులవుతారు. సేవే పరమావధిగా భావించే వైద్యులే వీరు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు వైద్యులపై కథనం..

- వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /26.3

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



ఆర్టీసీ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల బస్టేషన్, డిపోను ఆర్‌ఎం భవానీప్రసాద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. బస్‌స్టేషన్ విస్తరణపై చర్చించారు. మర్రి చెన్నారెడ్డి హయాంలో బస్‌స్టేషన్, డిపో ప్రారంభమయ్యాయని తెలిపారు. అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి జరుగలేదని పేర్కొన్నారు. త్వరలోనే అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక బీజేపీకి ఎన్నికలప్పుడే రాముడు గుర్తొస్తాడని ఎద్దేవా చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆర్టీసీ అధికారులు సన్మానించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(కరీంనగర్ జోన్) బుచయ్య, ఆదిలాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంజనేయులు, డీఎం శ్రీనివాసులు, అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్రీలత తదితరులు ఉన్నారు.

ఆలస్యంగా వచ్చారని..



పాఠశాల ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు

కోటపల్లి: పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వానలో నిలబెట్టారు కోటపల్లి గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్. పాఠశాలలో 6, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు పాఠశాల పునఃప్రారంభం తర్వాత సోమవారం పాఠశాలకు తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. ఆలస్యంగా వచ్చారని ఆగ్రహించిన ప్రిన్సిపాల్ విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను లోనికి రానివ్వలేదు. ఒవైపు వర్షం కురుస్తున్నా.. గేటు తీయలేదు. దీంతో రెండు గంటలపాటు వానలోనే నిరీక్షించారు. చివరకు తల్లిదండ్రులు ఇంకోసారి జరగదని లిఖితపూర్వకంగా హామీ ఇస్తామని తెలిపారు. అయినా ప్రిన్సిపాల్ అంగీకరించలేదు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని రావాలని ఆదేశించారు. దీంతో తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు బీఆర్‌ఎస్ నాయకుల జోక్యంతో పిల్లలను అనుమతించారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం ఆశోక్‌ను వివరణ కోరగా, విద్యార్థులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం లేది, విద్యార్థులకు, తల్లిదండ్రులకు చదువు, క్రమశిక్షణ విలువ తెలియాలని అనుమతించలేదని తెలిపారు.

జిల్లాస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న జగదీశ్‌నాయుడు

బెల్లంపల్లి: పట్టణంలోని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో అండర్ -16, 19 విభాగాల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను ప్రముఖ వైద్యుడు జగదీశ్‌నాయుడు ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు నిర్మల్, ఆదిలాబాద్, ఆర్మూర్, నిజామాబాద్, బెల్లంపల్లిలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో న్యాయవాది నల్లుల సంగీత, తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ జిల్లా ఇన్‌చార్జి నర్సింగ్, వెంకటేశ్వర్లు, కోచ్‌లు శేఖర్, గౌతమ్, ఒకేషనల్ ప్రిన్సిపాల్ రాజేశ్ పాల్గొన్నారు.

అందుబాటులో హెచ్‌బీఎస్‌ఏజీ కిట్లు

మంచిర్యాలటౌన్: హెపటైటిస్‌బి వ్యాధి నిర్ధారణకు అవసరమైన హెచ్‌బీఎస్‌ఏజీ కిట్లు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ రాము, డాక్టర్ రజిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీ పోచమ్మ గుడి వద్ద సోమవారం సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎవరికైనా హెపటైటిస్‌బి నిర్ధారణ జరిగితే వారి ఇంట్లో అందరికీ పరీక్ష చేయించడం మంచిదని సూచించారు. శిబిరంలో హెపటైటిస్‌బి పరీక్షలతోపాటు, మధుమేహం, రక్తపోటు, హెచ్‌ఐవీ, క్షయ పరీక్షలు నిర్వహించారు. 21 మందిని ఎక్స్‌రే కోసం ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.



మల్లన్న కల్యాణం



భేతమ్మ భ్రమరాంభసమేత శ్రీమల్లన్నస్వామి కల్యాణం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు..



అగ్నిగుండాల ప్రవేశం

జైపూర్: ఏటా తొలి ఏకాదశికి ముందు వేలాల మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు భేతమ్మ భ్రమరాంభిక శ్రీమల్లన్న స్వామికి పవిత్ర గోదావరిలో పుణ్యస్నానం చేయించారు. సోమవారం ఉదయం ఒగ్గు పూజారుల నేతృత్వంలో పెద్దపట్నం వేసి భేతమ్మ భ్రమరాంభికాసమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. సాయంత్రం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించగా, సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణం వీక్షించి తరించారు. స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. అగ్నిగుండాల్లో నిప్పులపై నడిచారు. మొక్కులు చెల్లించుకున్నారు. వానలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మల్లన్నను ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేశ్, ఎస్సై శ్రీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి.. జాప్యం!



ఎన్‌హెచ్-63గా మారే రోడ్డు ఇదే..

• ఫైనల్ కాని ఎన్‌హెచ్-63కి టెండర్లు
• దాఖలు చేసి నెలలు గడిచినా ఓపెన్ చేయని వైనం..
• కోర్టు కేసుల్లేని చోట్ల అవార్డుల జారీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-63) ప్రాజెక్టు హైబ్రిడ్ యాన్యూటీ మోడ్ (హామ్) పద్ధతిలో రూ.4,,568 కోట్లతో నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు మొత్తం 131.95 కిలోమీటర్ల పొడవును నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఆర్మూర్-మెట్‌పల్లి, మెట్‌పల్లి-జగిత్యాల, జగిత్యాల-రాయపట్నం, రాయపట్నం-మంచిర్యాల వరకు నిర్మించాల్సి ఉంది. మంచిర్యాల జిల్లాలో 33 కిలోమీటర్ల ఎన్‌హెచ్-63 నిర్మిస్తారు. అయితే, ఈ టెండర్ ప్రక్రియ కొలిక్కి రావడం లేదు. 2023 డిసెంబర్ నుంచి టెండర్ ఫైనలైజేషన్‌లో జాప్యం జరుగుతోంది. గడువు పలుమార్లు పొడిగించినా టెండర్ ఓపెన్ చేయడం లేదు.

ప్రాధాన్యం అంటూనే జాప్యం..

నరేంద్రమోదీ ప్రధానిగా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత, దేశంలోని 100 ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఎన్‌హెచ్-63కు చోటు కల్పించారు. ఇటీవల 'పీఎం ప్రయారిటీ' జాబితాలోనూ చేర్చారు. అటవీ అనుమతులు లభించినా పనులు ముందుకు సాగడం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో టెండర్ ప్రక్రియ పిలిచి నిలిపివేయడం, బహుళ దఫాలుగా జాప్యం జరగడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు తర్వాత ప్రారంభమైన ఎన్‌హెచ్-163జీ పనులు వేగంగా జరుగుతున్నాయి. జైపూర్ మండలంలో భూనిర్వాసితులకు పరిహారం చెల్లించి, నిర్మాణం కూడా మొదలైంది. ఎన్‌హెచ్-63 పనులు మాత్రం ప్రారంభించలేదు.

నిర్వాసితుల పోరాటం..

మంచిర్యాల-క్యాతనపల్లి మధ్య బైపాస్ నిర్మాణం కోసం అలైన్‌మెంట్ రెండుసార్లు మార్చిన తర్వాత తుది డిజైన్ ఖరారైంది. భూ సేకరణ, పరిహారం విషయంలో రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో, 17 గ్రామాల్లో 12 గ్రామాల రైతులు కేసులు వేశారు. దీంతో, మిగిలిన ఐదు గ్రామాల్లో పరిహారం(అవార్డు) ప్రకటనకు మంచిర్యాల ఆర్డీవో ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. వేంపల్లి, పోచంపాడు గ్రామాల్లో భూ అవార్డులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో జాతీయ రహదారి అథారిటీ రీజనల్ ఆఫీసర్ ఆమోదం తర్వాత రైతులకు నోటీసులు జారీ చేసి, పరిహారం చెల్లిస్తారు. పరిహారం తక్కువగా ఉందని భావిస్తే కలెక్టర్ వద్ద ఆర్బిట్రేషన్ కోసం అర్జీ దాఖలు చేస్తే, అదనపు పరిహారం పొందే అవకాశం ఉంది. ఎన్‌హెచ్-63 నిర్మాణంలో టెండర్ జాప్యం, భూ సేకరణ వివాదాలు, అలైన్‌మెంట్ మార్పులు వంటి అడ్డంకులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఎన్‌హెచ్-63 వివరాలు..

మొత్తం పొడవు	131కి.మీ
జిల్లాలో పొడవు	33కి.మీ
అంచనా వ్యయం	రూ.4,568కోట్లు
జిల్లాలో సేకరించే భూమి	378 ఎకరాలు

రోడ్డు వెళ్లే గ్రామాలు: లక్షెట్టిపేట, మోదెల, ఇటిక్యాల, పోతేపల్లి, గుల్లకోట, మిట్టపల్లి, కర్ణమామిడి, హాజీపూర్, పడ్తనపల్లి, నర్సింగాపూర్, గుడిపేట, ముల్కల, వేంపల్లి, మంచిర్యాల, తిమ్మాపూర్, క్యాతనపల్లి.

టెండర్ ఓపెన్ అయితేనే పనులు

కోర్టు కేసులు లేనిచోట్ల పరిహారం కోసం అవార్డుల జారీ జరుగుతోంది. రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టాలంటే ముందుగా టెండర్ ఓపెన్ చేయాల్సి ఉంది.టెండర్ పూర్తయితేనే పనులు మొదలవుతాయి.

– కేఎస్.అజయ్‌మణికుమార్, పీడీ, ఎన్‌హెచ్‌ఏఐ

ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

• ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చే వరకూ చూడొద్దు
• అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు
• కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించాలని, పరిష్కారానికి కలెక్టరేట్‌కు వచ్చే వరకూ చూడొద్దని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే అర్జీలు పరిష్కరించడంలోనూ జాప్యం చేయవద్దని సూచించారు. కలెక్టేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్, హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్లు, పరిహారం, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి.

సాగు చేసుకోనివ్వడం లేదు..



గిరిజన రైతులమైన మేము వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నాం. 35 ఏళ్ల సాగు చేసుకుంటున్న పోడు భూముల్లోకి రాకుండ అటవీ అధికారులు అడ్డుకుంటన్నారు. ఈ ఏడాది విత్తనాలు వేయకుండా అడ్డుకున్నారు. మాకు సాగు చేసుకునే అవకాశం ఇవ్వాలి.

– పోడు భూముల గిరిజనరైతులు వెంకయపల్లి, తాండూర్ మండలం


రుణం ఇవ్వడం లేదు..



గత ప్రభుత్వం పోడుభూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాపాసుపుస్తకాలు ఇచ్చింది. పెట్టుబడి కోసం రుణం కావాలని బ్యాంకుకు వెళ్తే ఇవ్వడంలేదు. ఇతర ప్రాంతాల్లో పోడు పట్టాలు పొందిన రైతులకు రుణాలు ఇస్తున్నారు. మాకు ఇప్పించండి.

– పోడు రైతులు, రెబ్బెన, వీరాపూర్, కన్నెపల్లి

మద్యం దుకాణం తరలించాలి



మా ఇంటి పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మందుబాబులు సీసాలు పగల కొట్టి హంగామా చేస్తున్నారు. ఇంటి ముందే మద్యం తాగుతున్నారు. రాత్రి ఇబ్బందిగా ఉంది. మద్యం దుకాణం తరలించాలి.

– లక్ష్మి, సీసీసీ రోడ్, నస్పూర్

పెన్షన్ రావడం లేదు..



పుట్టుకతోనే దివ్యాంగుడైన మా కొడుకుకు 75 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. 2019 నుంచి 2024 వరకు కొనసాగింది. రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకుంటే మీసేవలో స్లాట్ బుక్ కావడం లేదు. దీంతో నవంబర్ నుంచి పెన్షన్ రావడం లేదు.

– దివ్యాంగుడు అనురుత్, క్యాతన్‌పల్లి

పట్టు పురుగుల పెంపకానికి అనుమతివ్వాలి..



'మాది చెన్నూర్ మండలం కిష్టపేట. 40 ఏళ్లుగా అటవీ శాఖకు చెందిన 110 హెక్టార్ల భూమిలో పట్టు పురుగులు పెంచుతూ ఉపాధి పొందుతున్నాం. ఇటవీల అటవీ శాఖ అధికారులు 'కావ్వల్ టైగర్ రిజర్వ్ పరిధిలో పట్టు పురుగల పెంపకం నిషేధం' అని బోర్డు పెట్టారు. మమ్మల్ని అటవీ భూముల్లోకి రానివ్వడం లేదు' అని పట్టుపురుగుల పెంపకం రైతులు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న పట్టుపరిశ్రమ శాఖ ఏడీ పార్వతి రాథోడ్‌ను వివరణ కోరారు. అటవీ శాఖ అధికారులు సమాచారం ఇచ్చారని ఏడీ తెలిపారు. ఆ విషయం రైతులకు ఎందుకు తెలుపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అక్కడే తెలియజేశానని, అయినా వచ్చాని వెల్లడించారు. మరోసారి ఇక్కడ వివరించాలని ఆదేశించడంతో ఆమె తెలియజేశారు. అనంతరం రైతులు తమకు ఆధారం చూపాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. స్పందించిన కలెక్టర్ అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. చెట్లు నరకకుండా పెంచుకునేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో కలెక్టర్ వారికి వెల్లడించారు.

సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయాలి

• రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్.చౌహాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్.చౌహాన్ సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సంచాలకులు ముజామిల్‌ఖాన్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్, పౌరసఫరాల శాఖ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సీజన్‌లో లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించాలని తెలిపారు. వచ్చే సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రేషన్ కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు జారీ చేయాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష్యం మేరకు ధాన్యం సేకరించి మిల్లులకు తరలించామని తెలిపారు. సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు



ముసురు వర్షంతో బురదమయమైన రోడ్డు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు ముసురు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వర్షంతోపాటు చల్లగాలి వీయడంతో వృద్ధులు, చిన్నారులు వణుకుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షంతో పత్తి మొలకలు ప్రాణం పోసుకుంటున్నాయి. భారీ వర్షాలు లేక, వాగులు, వంకల్లో ప్రవాహం లేదు. చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు చేరలేదు. జూలైలో ఆశించిన వర్షాలు కురుస్తాయని రైతులు ఆశత ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం..

జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం వరకు 13.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. భీమినిలో 26.1 మిల్లీమీటర్లు, కన్నెపల్లిలో 24, కోటపల్లిలో 22.8, వేమనపల్లిలో 22.5, నెన్నెలలో 20.2, చెన్నూర్‌లో 17.7, బెల్లంపల్లిలో 17.2, తాండూర్‌లో 14.2, భీమారంలో 13.2, మందమర్రిలో 12.8, జైపూర్‌లో 12.4, మంచిర్యాలలో 12, నస్పూర్‌లో 10.5, కాసిపేటలో 8.3, హాజీపూర్‌లో 7.7, దండేపల్లిలో 4.9, లక్షెట్టిపేటలో 3.2, జన్నారంలో 1.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా జూన్ 30 వరకు సాధారణ వర్షపాతం 159.8 మిల్లీమీటర్లు కాగా, 95.7 మిల్లీమీటర్లు కురిసింది. సగటున 40 శాతం లోటు నెలకొంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బాలుర జూనియర్ కళాశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ శ్రీకాంత్, పీఈటీ సాగర్ తెలిపారు. జూన్ 29న మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో 12-14 ఏళ్ల విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. 14 ఏళ్ల విభాగంలో లాంగ్‌జంప్, పరుగుపందెం పోటీల్లో ఎ.అరుణ్‌కుమార్, 12 ఏళ్ల విభాగంలో జావలిన్ త్రోలో జి.సాయిచరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. జూలై 6న హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ మోహన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ కె.మహేశ్వర్‌రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపకులు అభినందించారు.

ఇళ్ల పట్టాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి స్థలాల్లో శాశ్వతంగా నివాసం ఉంటున్నవారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బీజేపీ నాయకులు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఏరియా ఎస్ఓటూ జీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు వెరబెల్లి రఘునాథరావు మాట్లాడుతూ అందరికీ పట్టాలిస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చి, కొద్ది మందికే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. కాంగ్రెస్ కూడా పట్టాలిస్తామని విస్మరించిందని పేర్కొన్నారు. ధర్నాలో జిల్లా నాయకులు గాజుల ముఖేశ్‌గౌడ్, ఎనగందుల కృష్ణమూర్తి, తిరుపతి, పి.కమలాకర్‌రావు, పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, నాయలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

మంచిర్యాలటౌన్: మహబూబ్‌నగర్ జిల్లాలో జూన్ 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు బహుమతులను సాధించారని మాస్టర్లు ఎం.నాగలక్ష్మి, ఎం.సరీశ్ తెలిపారు. ఎం.మాన్వి(గోల్డ్‌మెడల్), రేశాన్స్ పటేల్(గోల్డ్‌మెడల్), సీహెచ్.ప్రానిన్స్(గోల్డ్‌మెడల్), శివతేజ(బ్రాంజ్‌మెడల్), సూర్య(బ్రాంజ్‌మెడల్) సాధించారని వివరించారు. రాయపూర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో డీఈవో యాదయ్య, సైన్స్ అధికారి, జాతీయ హరితదళం జిల్లా సమన్వయకర్త మధుబాబుతో కలిసి నేషన్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ 2025 కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ, విద్య మంత్రిత్వ శాఖల సౌజన్యంతో ' హరిత జీవన విధానం' నినాదంతో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆగస్టు 30న ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైలులోంచి కిందపడిన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం బోదన్‌పల్లికి చెందిన ఐటీఐ విద్యార్థి చింతపూడి కార్తీక్ (17) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మృతుడు కార్తీక్ తన తల్లి భీమక్కతో కలిసి కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మందమర్రి రైల్వేస్టేషన్ వద్ద కాలుజారి కిందపడ్డాడు. గాయాలు కావడంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భీమక్క ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

'ఇసుక అక్రమ రవాణాకు తావులేదు'



చెక్‌పోస్టు వద్ద ఏసీపీ, మైనింగ్ ఏడీ

కోటపల్లి: మండలంలోని ఎర్రాయిపేట ఇసుక క్వారీలో ఎలాంటి అక్రమ రవాణా జరగడంలేదని మైనింగ్ ఏడీ జగన్మోహన్ రెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పార్‌పల్లి జాతీయ రహదారిపై టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీ చెక్‌పోస్టును సందర్శించారు. మైనింగ్ ఏడీ మాట్లాడుతూ మండలంలోని ఇసుక క్వారీల్లో 24గంటలు మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారుల తనిఖీలతో పకడ్బందీగా ఇసుక తరలిస్తున్నామని, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో లారీల్లో ఇసుకలోడ్ జరుగుతుందని, అక్రమ రవాణా జరుగుతుందని వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. ఇసుక లోడింగ్ నిలిచిపోవడంతో లారీలు పెద్దఎత్తున ఆగాయని, వాటిని కూడా పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ దేవేందర్ రావు, ఎస్సై రాజేందర్, తహసీల్దార్ రాఘవేందర్‌రావు, డీటీ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మేమున్నామని..

నిర్మల్‌ఖిల్లా: వైద్యో నారాయణో హరి అంటారు.. వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. దేవుడు జన్మనిస్తే.. డాక్టర్ పునర్జన్మనిస్తాడు. కనిపించే దేవుడు.. రోగికి ప్రాణం పోసే ప్రాణదాత డాక్టర్. నాడి పట్టి.. గుండె గుబులును దూరం చేసేది వైద్యుడే. ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బిధాన్ చంద్రరామ్ పుట్టిన రోజున జాతీయ డాక్టర్స్ డే జరుపుకుంటున్నారు. 1882 జూలై 1న జన్మించిన రాయ్ కలకత్తా మెడికల్ కళాశాలలో వైద్యడిగ్రీ పొందారు. లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి 1911లో స్వదేశానికి వచ్చి వైద్య సేవలు ప్రారంభించారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వైద్యవృత్తిలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 1961లో భారత రత్న అవార్డుతో సత్కరించింది. 1962 జూలై1న కన్నుమూశారు. బిధాన్ చంద్ర రామ్ జయంతిని డాక్టర్స్‌డేగా జరుపుకోవాలని 1961లో ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వృత్తినే దైవంగా భావిస్తూ.. రోగులకు స్వస్థత చేకూరుస్తూ... మేమున్నామని ధైర్యం చెబుతున్న వైద్యులపై ప్రత్యేక కథనం..



- ప్రాణదాతలుగా నిలుస్తూ.. పునర్జన్మనిస్తూ
- రోగుల సేవలో తరిస్తున్న వైద్యులు
- వృత్తికే వన్నె తెస్తున్న ఆపద్బాంధవులు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

25 ఏళ్ల అనుభవం..



1995లో గాంధీ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, 1998లో ఎండీ, పిడియాట్రీషన్ పూర్తిచేశా. మూడేళ్లపాటు నిజామాబాద్‌లో పిల్లల వైద్యునిగా పనిచేశా. 2012లో నిజామాబాద్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైనప్పటి నుంచి వివిధ హోదాలలో సేవలు అందించా. గతేడాది నుంచి నిర్మల్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టా. ఈ 25 ఏళ్ల అనుభవంలో ఎంతో మందికి సేవలు అందించా. పేదలకు సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా.

– డాక్టర్ గోపాల్‌సింగ్, సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆసుపత్రి, నిర్మల్

వైద్యసేవలు అందించాలనే..



పేదలకు వైద్యసేవలు అందించాలనే వైద్యవృత్తిని ఎంచుకున్నా. 25 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నా. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే వసతులు, వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నా. వైద్యవృత్తి సేవా దృక్పథంతో ముడిపడి ఉంటుంది. డబ్బుల కోసమే కాకుండా స్వచ్ఛందంగా వైద్య సేవలందించాలి.

– డాక్టర్ కాశీనాథ్, సూపరింటెండెంట్, భైంసా ఏరియా ఆసుపత్రి

జీవితం పేదల కోసమే..



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నా. పేదలకు సేవ చేయడానికి జీవితాన్ని అంకితం చేశా. నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నా. నిత్యం 300 నుంచి 400 మంది ఆయా సేవల నిమిత్తం వస్తుంటారు. చివరి పేషెంట్ వరకు ఏరోజుకు ఆరోజు స్కానింగ్ చేయడంతో పాటు రిపోర్టులు తయారు చేసి రోగులు ఇబ్బందులు పడకుండా చూస్తాం. సేవలకు గుర్తింపుగా కలెక్టర్, మంత్రుల చేతుల మీదుగా పలుమార్లు అవార్డులు అందుకున్నా.

– నూతుల కళ్యాణ్‌రెడ్డి, ప్రొఫెసర్, రిమ్స్

ప్రజలకు సేవ చేయాలని..



ఆదిలాబాద్‌టౌన్: వరంగల్‌లోని కేఎంసీలో వైద్య విద్య అభ్యసించా. ఢిల్లీలో పీజీ పూర్తి చేశా. అక్కడే అంబేడ్కర్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించా. జిల్లా ప్రజలకు వైద్యసేవలు అందించాలని తండ్రి శ్రీరాములు కోరిక మేరకు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యునిగా చేరారు. నాలుగేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నా. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నా.

– డాక్టర్ ఆడె విఠల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్

నమ్మకమైన సేవలు అందించాలి



అమ్మానాన్నల ప్రోత్సాహంతో వైద్య కోర్సు పూర్తిచేశా. వైద్యోనారాయణోహరి అనే నానుడిని నేడు కార్పొరేట్ ఆస్పత్రులు పూర్తిగా డబ్బులకు ఆశపడి మరిచిపోతున్నాయి. వైద్యులు రోగులకు నమ్మకమైన సేవలందించాలి. వైద్యరంగంలో రాణించాలనుకునే యువత ముందుగా ఎథికల్ ప్రాక్టీస్ చేయాలి. వైద్యులు ముఖ్యంగా మాతాశిశు మరణాలు జరగకుండా ఆపగలిగితే మనదేశం అభివృద్ధిలో మరింత ముందుంటుంది.

– డాక్టర్ ప్రత్యూష, లక్ష్మణచాంద పీహెచ్‌సీ

వృత్తిలో తృప్తి



రోగులకు వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇష్టంగా ఎంచుకున్న వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం కడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా విధులు నిర్వహిస్తున్నా. వైద్య వృత్తిలో తృప్తి లభిస్తోంది.

– శివకుమార్, కడెం పీహెచ్‌సీ

బీసీరాయ్ ఆదర్శం..



వైద్యవృత్తి ఎంతో గౌరవప్రదమైనది. ప్రతీ ఉద్యోగికీ ఉద్యోగ విరమణ ఉంటుంది. కానీ వైద్యుడికి మాత్రం ఉండదు. తాను చనిపోయేంత వరకు వైద్యం అందిస్తూనే ఉంటారు. ప్రతీ వైద్యుడు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి. డాక్టర్ బీసీ రాయ్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు వైద్యసేవలు అందిస్తున్నా.

– డాక్టర్ అశ్వీర్‌రెడ్డి, మత్తు వైద్యనిపుణులు, నర్సాపూర్(జి) సీహెచ్‌సీ

18 ఏళ్లుగా సేవలు..



చెన్నూర్: పద్దెనిమిదేళ్లుగా చెన్నూర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్నా. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నా. రోగులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇప్పటి వరకు పలు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నా. రాబోయే రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తా.

– సత్యనారాయణ, చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

సమాజ సేవలో చంద్రదత్



మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన వైద్యుడు జీవీఎంఎస్ చంద్రదత్ ఐబీ సమీపంలో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. తరచూ ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు సైతం అందిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగుల ఆర్థిక పరిస్థితినిబట్టి ఫీజులు తీసుకుంటున్నారు. అనవసరమైన టెస్టులు చేయకపోవడం, అవసరానికి మించి మందులు రాయడం వంటివి లేకపోవడంతో ప్రజలు నమ్మకంగా వస్తున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధాశ్రమంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు. ఆశ్రమాలకు అవసరమైన సరుకులు, నగదు అందజేస్తున్నారు.

– డాక్టర్ చంద్రదత్, జనరల్ మెడిసిన్

సఫారీకి సెలవు

- జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేత
- అక్టోబర్ నుంచి పునఃప్రారంభం



జంగిల్ సఫారీ

జన్నారం: కవ్వాల్ అభయారణ్యంలోని జన్నారం అటవీ డివిజన్‌లో జంగల్ సఫారీకి అటవీశాఖ మూడు నెలలపాటు సెలవు ప్రకటించింది. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పచ్చదనం పంచుతున్న అడవి అందాలను తిలకించేందుకు పర్యాటక శాఖ జన్నారంలో హరిత రిసార్ట్‌లు ఏర్పాటు చేయగా పర్యాటకశాఖ రెండు సఫారీలు, అటవీశాఖ ఐదు సఫారీలు ఏర్పాటు చేశారు. జన్నారం వచ్చిన పర్యాటకులు సఫారీ ద్వారా దట్టమైన అడవిలోనికి వెళ్లి పచ్చని చెట్ల నడుమ పర్యటించడం వల్ల ఆహ్లాదం పొందుతున్నారు. అడవుల అందాలను, వన్యప్రాణుల పరుగులను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.

మూడు నెలలపాటు నిలిపివేత

అడవుల అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు మూడు నెలల పాటు సఫారీ ప్రయాణానికి అనుమతి లేదు. ఎందుకంటే వర్షాకాలంలో వన్యప్రాణులు ఎదకు వచ్చి బయట విచ్చలవిడిగా తిరుగుతాయి. సఫారీ ప్రయాణంతో వాటికి ఆటంకం కలుగుతుంది. వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలిగించవద్దనే ఉద్దేశంతో మూడు నెలలు (జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) అనుమతులు నిరాకరిస్తూ అటవీశాఖ అధికారులు పర్యాటకశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.


మూణ్నెళ్లు బంద్‌చేస్తాం

ఎన్‌టీసీఏ సూచనల ప్రకారం ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మూడు నెలలపాటు సఫారీ ప్రయాణం బంద్ చేయడం జరుగుతోంది. వర్షాల కారణంగా అడవిలో బురదలో వాహనాలు కూరుకుపోయి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అక్టోబర్‌లో తిరిగి అనుమతులు ఇస్తాం. పర్యాటకులు గమనించాలి.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

మీ తమ్మునిపై కేసు అయ్యింది..

- ఉపాధ్యాయుడికి సైబర్ నేరస్తుడి ఫోన్..
- అప్రమత్తతతో తప్పించుకున్న బాధితుడు



ప్రకాశ్‌నాయక్

జన్నారం: హలో.. నేను సీబీఐ నుంచి మాట్లాడుతున్నా.. మీ తమ్మునిపై కేసు నమోదైంది. మీరు వెంటనే ఆదిలాబాద్ రండి.. లేకుంటే చాలా ప్రమాదంలో పడుతారని ఉపాధ్యాయుడికి ఫోన్‌రావడంతో మొదట బిత్తరపోయిన ఉపాధ్యాయుడు తేరుకుని సైబర్ నేరస్తుడని గ్రహించి తప్పించుకున్న సంఘటన జన్నారంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాశ్‌నాయక్‌కు ఓ వ్యక్తి ఫోన్‌చేసి నేను సీబీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నా.. మీ తమ్ముడు ప్రమోద్‌పై కేసు నమోదైంది. మీరు వెంటనే ఆదిలాబాద్‌కు రండి అని చెప్పాడు. మొదటగా భయాందోళనకు గురైన ఉపాధ్యాయుడు వెంటనే ఆదిలాబాద్‌లో ఉంటున్న ప్రమోద్‌కు ఫోన్ చేశాడు. ఎక్కడున్నావని అడుగగా గుడిలో పూజ చేస్తున్నట్లు చెప్పాడు. సదరు ఉపాధ్యాయుడు అదే నంబర్‌కు ఫోన్ చేసి బెదిరించడంతో సైబర్ నేరగాడు ఫోన్ కట్ చేశాడు. విషయాన్ని ఎస్సై అనూషకు చెప్పడంతో అలాంటి ఫేక్ కాల్‌లను నమ్మవద్దని సూచించారు.

ఏరియాస్థాయి స్ట్రక్చరల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న గుర్తింపు సంఘం నాయకులు, అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి యజమాన్యానికి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకుల మధ్య సోమవారం ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం జరిగింది. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ నాయకులు పలు డిమాండ్లపై చర్చించారు. ఏరియాలో సర్వేస్ డిపార్టుమెంట్‌లో ఖాళీ ఉన్న జనరల్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రిటైర్డ్ క్లెయిములను వెంటనే సెటిల్ చేసి డబ్బులను చెల్లించాలని, టింబర్ వర్క్‌మెన్ డిజిగ్నేషన్‌ను మార్చి కేటగిరీ ఉద్యోగులుగా పరిగణించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం ఎన్.సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, యూనియన్ ప్రతినిధులు కొట్టే కిషన్‌రావు, మోత్కూరి కొమురయ్య, చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో అకడమిక్ రివ్యూ మీటింగ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో 2025–26 విద్యాసంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అకడమిక్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్, ఓఎస్‌డి ప్రొఫెసర్ ఈ. మురళీధర్షన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, రిజిస్టర్ల నిర్వహణ, డేటా భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్‌ఏఏసీ ఫైల్ తయారీపై అన్ని శాఖల అధ్యాపకులు శ్రద్ధ వహించాలని సూచించారు. త్వరలో (ఎంటెక్)పీహెచ్‌డీ ప్రవేశ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. బాసర, మహబూబ్ నగర్ సెంటర్లకు సంబంధించిన ప్రవేశ ఫలితాలు విడుదల జూలై 4న, జూలై 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ ఫలితాలను మొదటిగా విడుదల చేసిన విశ్వవిద్యాలయంగా బాసర ఆర్జీయూకేటీ నిలిచిందన్నారు. ఇందులో భాగమైన టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీన్లు డాక్టర్ మహేష్, డాక్టర్ విట్టల్, డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, పీఆర్‌వో విజయ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతికశాఖ సలహామండలి సభ్యుడిగా నాగరాజు



నాగరాజు

మందమర్రి రూరల్: మందమర్రి పట్టణానికి చెందిన ధూంధాం సాంస్కృతిక విభాగం వ్యవస్థాపకుడు అంతడ్పుల నాగరాజును తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సాంస్కృతిక మండలి సలహాదారుగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పలువురు కళాకారులు నాగరాజును అభినందించారు.

'9న సమ్మె విజయవంతం చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నస్పూర్ కాలనీలోని జీటీ హాస్టల్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తుందన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. ఈ సమ్మెతో కేంద్రానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు ముస్కె సమ్మయ్య, బాజీ సైదా, కిషన్ రావు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బండి రమేశ్, చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, కిషన్ రెడ్డి, కాంతయ్య, సత్యం, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ సమ్మె నోటీసు

జూలై 9న జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును హెచ్‌ఎంఎస్ నాయకులు శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్‌కు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య, ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, అశోక్, గొల్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.